విస్తారంగా వర్షాలు

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా అమరాపురం మండలంలో 98.2 మి.మీ, మడకశిర మండలంలో 88.4 మి.మీ, గుడిబండ మండలంలో 41.6 మి.మీ, రొళ్ల మండలంలో 62.2 మి.మీ, అగళి మండలంలో 42.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పట్టణంలోని శివాలయం వద్ద భారీగా వర్షపు నీరు చేరింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షపు నీరు చేరడంతో గుంతలు కనపడక ఓ వాహనం నీటిలోనే బోల్తా పడింది. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

దెబ్బతిన్న రోడ్డు

మడకశిర రూరల్: మండలంలో శుక్రవారం రాత్రి 88.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఒంటిపాళ్యం-క్యాంపురం గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురైంది. అధికారులు చర్యలు తీసుకుని కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరారు. మళ్లీ వర్షం కురిస్తే రోడ్డు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. కల్లుమర్రి, ఉప్పిడిపల్లి, ఎల్లోటి ,జమ్మానిపల్లి చెరువులకు వర్షపు నీరు చేరింది. ఎండుముఖం పట్టిన పంటలకు జీవం వచ్చిందని రైతులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడానికి వంద శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. సీజన్‌లో సకాలంలో వర్షం రాక వేరుశనగ పంట సాగు చేయని భూముల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడానికి తేమ శాతం బాగా ఉందని పేర్కొన్నారు. ఇప్పుడు వివిధ రకాల విత్తనాలు అందిస్తే పంటలను సాగు చేసుకుంటామని చెబుతున్నారు.


పెనుకొండ మండలం మక్కాజిపల్లి తండా రైల్వే వంతెన వద్ద ప్రవహిస్తున్న వర్షపు నీరు


రొళ్ల మండంల కేజీ గుట్ట గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో కల్వర్టు దెబ్బతిన్న దృశ్యం


మడకశిర మండలం ఒంటిపాళ్యం రోడ్డు కోతకు గురైన దృశ్యం

రొళ్లలో కుండపోత..

రొళ్ల: మండలంలోని శనివారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి 62.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో చెక్‌డ్యాంలు, కుంటలు, చెరువులకు కొద్ది పాటి వర్షపు నీరు చేరింది. గత వారం రోజులుగా చిరుజల్లుతో పాటు కుండపోత వర్షం కురవడంతో రైతులు పంటల సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

కుండపోత వర్షానికి దెబ్బతిన్న కల్వర్టు

రొళ్ల: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకూ కుండపోత వర్షం కురిసింది. వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు, కుంటలోకి వర్షపు నీరు చేరింది.
544ఈ జాతీయ రహదారి నుంచి కేజీ గుట్ట గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలోని సప్లయ్ చానల్ వద్ద ఏర్పాటు చేసిన కల్వర్టు నీటి ఉధృతికి దెబ్బతింది.


మడకశిరలోని శివాలయం వద్ద వర్షపు నీటిలో బోల్తా పడిన వాహనం

ఇటీవల హొట్టేబెట్ట సర్పంచ్ ప్రకాష్ కల్వర్టు వద్ద గుంతలు పడటంతో జేసీబీ సహాయంతో మట్టి, రాళ్లు వేసి పూడ్చారు. అయితే రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి రాళ్లు, మట్టి నీటి ఉధృతికి కొట్టుకుని పోయాయి. ప్రస్తుతం కల్వర్టు దెబ్బతినడంతో ఏ సమయంలోనైనా కూలే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని కల్వర్టు వద్ద మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గుడిబండ: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి దాదాపు గంటన్నర పాటు ఏకధాటిగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. 41.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వేరుశనగ, కంది, రాగి, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పెనుకొండలో భారీ వర్షం

పెనుకొండ రూరల్: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మండల వ్యాప్తంగా 50.మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఎస్‌ఐ రమేష్‌బాబు బాధ్యతల స్వీకరణ



సోమందేపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రమేష్ బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్ వీఆర్‌కు వెళ్లిపోయారు. నల్లమాడ నుంచి బదిలీపై రమేష్ బాబు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. మట్కా, పేకాట, అక్రమ మద్యం రవాణా పూర్తి స్థాయిలో నిర్మూలిస్తామన్నారు.

సమాజంలో మార్పునకు కృషి చేయండి

మడకశిర: సమాజంలో మార్పునకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ నాగమల్లేశ్వరి సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 12న ప్రారంభమైన బేటీ బచావో బేటీ పడావో వారోత్సవాలు శనివారం ఐసీడీఎస్ కార్యాలయంలో ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలను చదువించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతం చేయాలన్నా రు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై అవగాహన పెంచాలని కోరారు. చిన్న వయసులో ఆడ పిల్లలు గర్భం దాల్చడం కూడా ప్రమాదకరమని, ఈ విషయాన్ని ఆడపిల్లల తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. లింగ సమానత్వం మన ఇంటి నుంచే ప్రారంభ కావాలన్నారు. కార్యక్రమంలో కదిరేపల్లి, నీలకంఠాపురం పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు నరేష్, భార్గవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలావతి, సన్నక్క, శంకరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొత్స విజయంపై హర్షం

రొళ్ల: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. వైఎస్సార్‌సీపీ తొలి విజయమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు హర్షం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. బలం లేకున్నా కూడా బొత్స సత్యనారాయణను ఎదుర్కొవడం కోసం కూటమి ప్రభుత్వం కూడా గట్టిగానే ప్రయత్నించిందన్నారు. అయితే ఎన్ని కుయుక్తులు పన్నినా కూడా బొత్స విజయాన్ని కూటమి ప్రభుత్వం ఆపలేకపోయిందన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నిక వాయిదా

రొద్దం: మండలంలోని కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. శనివారం పోలీసుల బందోబస్తు నడుమ కమిటీ ఎన్నికలు జరిగాయి. అయితే టీడీపీలో రెండు వర్గాల మధ్య చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవడానికి సయోధ్య కుదరక పోవడంతో వాయిదా పడినట్లు సమాచారం. రెండు వర్గాల్లో చైర్మన్, ఉప చైర్మన్ తమకు కావాలని ఓ వర్గం, తమకు కావాలని మరో వర్గం పట్టు బట్టడంతో అధికారులు ఎన్నికలు వాయిదా వేశారు.

క్లుప్తంగా

పశువుల్లో గర్భకోశ వ్యాధులపై అవగాహన


ఎల్.తిమ్మాపురంలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యులు

రొద్దం: పశువుల్లో సూలు, నిర్ధారణ, గర్భకోశ వాధులపై పాడి రైతులకు పశుసంవర్ధకశాఖ అధికారులు అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని ఎల్.తిమ్మాపురం లో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. పాడి రైతులకు పశువులకు అవసరమయే మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువర్ధకశాఖ డీఎల్డీఏ అనంతపురం కార్యనిర్వాహక డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పీవీ సుధాకర్ పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాలకులు శివశంకర్‌నాయక్, స్థానిక డాక్టర్ జాహ్నవి, మండల ఏహెచ్‌ఏలు, గోపాల మిత్రులు, రైతులు పాల్గొన్నారు.

పంటల నూర్పిడికి కల్లం ఏర్పాటు


ఆర్.లోచెర్లలో కల్లం ప్రారంభిస్తున్న సొసైటీ ప్రతినిధులు

రొద్దం: మండలంలోని ఆర్.లోచెర్ల గ్రామంలో రైతులకు పంటల నూర్పిడి కోసం శనివారం కల్లం ప్రారంభించారు. టింబక్టివ్-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటైన ధరణి కోఆరేటివ్ సొసైటీ ద్వారా గ్రామంలో ఉన్న సేంద్రియ వ్యవసాయ రైతులకు కల్లం ఏర్పాటు చేసినట్లు ధరణి సొసైటీ సీఈఓ మహేష్ తెలిపారు. రైతులు కల్లం నిర్మాణం పనులు, వాడకం, ఉపయోగాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విధానం, వ్యవసాయంలో వస్తున్న మార్పులపై తెలియజేశారు. కార్యక్రమంలో టింబక్టివ్-కలెక్టివ్ అధినేత బబ్లూగంగూలి, ధరణీ సొసైటీ సభ్యులు తదిలరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులకు ఉరే సరి

• ఏజీపీ భాస్కరరెడ్డి

పెనుకొండ: హత్యాచార ఘటనకు పాల్పడిన నిందితులకు ఉరే సరైన సమాధానమని పెనుకొండ ఏజీపీ భాస్కరరెడ్డి పేర్కొన్నారు. కలకత్తాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై శనివారం ఆయన మాట్లాడారు. భారతదేశంలో చట్టాలు బలంగా ఉన్నా అమలులో ఉన్న లోపాలతో ఇలాంటి ఘటనలు పెరిగిపోతున్నాయన్నారు. నేరస్తులకు ఉరి శిక్షే సమాధానమన్నారు. అప్పటి ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా చట్టంతో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయించి మహిళలపై జరిగిన పలు కేసుల్లో విచారణ వేగవంతం చేయించారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల న్యాయవాదులు ఇలాంటి అమానుష చర్యలకే పాల్పడే నిందితులకు కనీసం కోర్టుల నుంచి బెయిల్ ఇప్పించరాదన్నారు. బాధిత కుటుంబానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు.

28న అధ్యక్ష ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికలు

పావగడ: స్థానిక మున్సిపల్ అధ్యక్ష ఉపాధ్యక్ష స్థానాలకు రెండో విడతలో ఈనెల 28 న ఎన్నికలు జరుగనున్నట్లు జిల్లా ఎన్నికల కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. అలాగే అధ్యక్ష స్థానం జనరల్ కేటగిరీకి, ఉపాధ్యక్ష స్థానం జనరల్ మహిళ కేటగిరీకి రిజర్వ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అధ్యక్ష స్థానానికి 4వ వార్డు కౌన్సిలర్ సుదేశ్ బాబు పేరు ప్రముఖంగా వినపడుతోంది. అదే విధంగా 14వ వార్డు కౌన్సిలర్ పి.రాజేశ్ కూడా పోటీలో ఉంటారని వినిపిస్తోంది. ఉపాధ్యక్ష స్థానానికి ముగ్గురు బరిలో ఉండే అవకాశం ఉంది. అయితే అధ్యక్ష స్థానం బంతి ఎమ్మెల్యే వెంకటేశ్ కోర్టులో ఉన్నట్లు తెలుస్తోంది.

గుట్టూరు శ్రీరాములు కుటుంబానికి పరామర్శ


జెడ్పీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

పెనుకొండ రూరల్: గుండెపోటుతో మృతిచెందిన జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు కుటుంబాన్ని మాజీ ఏపీసీసీ అధ్యక్షుడు నీలకంఠాపురం రఘువీరా రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్ పరామర్శించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. భార్య నాగరత్నమ్మ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రఘువీరా రెడ్డి మాట్లాడుతూ శ్రీరాములు మృతి చెందడం తీరనిలోటన్నారు. పెనుకొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నరసింహులు, రమణారెడ్డి, కొండల రాయుడు పాల్గొన్నారు.

ఆగని ఇసుక, మట్టి అక్రమ రవాణా

పరిగి: మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా ఆగలేదు. అధికార బలం, రాజకీయ పలుకుబడితో ఇసుకాసులు రెచ్చిపోతున్నారు. మండలంలో పేట్రేగిపోతున్న 'ఇసుకాసులు, మట్టి మాఫియా' అన్న శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. అయినా ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టలేదు. పరిగి మండలంలోని పెన్నా, జయమంగళి నదుల నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. పరిగి మండలంలో జరుగుతున్న చర్యలపై దృష్టి పెట్టకుండా హిందూపురం మండలంలోని సింగరెడ్డిపల్లి, కొల్లకుంట గ్రామాల పరిధిలో జరిగిన ఇసుక అక్రమ రవాణాపై దాడులు నిర్వహించినట్లు అధికారులు చెప్తున్నారు. మండలంలో తాజాగా శనివారం శ్రీరంగరాజుపల్లి పంచాయతీ ముల్లమోతుకపల్లిలో అధికార పార్టీల నేతలు ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో తరలించడాన్ని అధికారులకు సమాచారం అందించినా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


ముల్లమోతుకపల్లిలో ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న దృశ్యం

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం


అబ్దుల్ మజీద్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్


రంజిత్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

• మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఏకష్టం వచ్చినా ఆపదలో అండగా ఉంటామని మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ తెలిపారు. శనివారం ఆమె పరిగి మండల కేంద్రంలో పర్యటించారు. ఆత్మహత్య చేసుకున్న రంజిత్‌రెడ్డి ఇంటికెళ్లి అతని మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులను ఓదార్చారు. రంజిత్‌రెడ్డి లేని లోటు తీరనిదని, భవిష్యత్తులో అతని కుటుంబానికి తోడుగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం మండల కోఆప్షన్ మెంబర్ సలీంఖాన్ తండ్రి అబ్దుల్ మజీద్ శనివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ అబ్దుల్ మజీద్ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి


వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ పార్థసారథి తదితరులు

మడకశిర: పట్టణంలోని కొల్లాపురమ్మ దేవాలయ ఆవరణలో శనివారం పట్టణ వాల్మీకి సేవాసమితి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, వాల్మీకి సేవాసమితి నాయకులు, వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాల్మీకి సేవా సమితి ప్రతినిధులు వీరిని ఘనంగా సన్మానించారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాల్మీకుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సేవాసమితి అధ్యక్షుడు మోహన్, నాయకులు ఓబులేసు, మనోహర్, మాధవరాజు, రవీంద్ర, ఈశ్వరప్ప, వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

హిందూపురం: భారత స్వాతంత్ర్య వారోత్సవాల్లో భాగంగా అఖిల భారత షహీద్ టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఖాన్ ఆధ్వర్యంలో నాల్ బంద్ రఫీక్ సాబ్ అధ్యక్షతన మక్తబ్ ఏ రహమానియా మద్రసాలో శనివారం సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులకు సౌభ్రాతృత్వం, సామాజిక విలువలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా 'శ్రావణ' పూజలు


హిందూపురం: డీబీ కాలనీలోని శనీశ్వరస్వామి


డ్రైఫ్రూట్స్ అలంకరణలో గడ్డమీద ఆంజనేయస్వామి

సాక్షి నెట్‌వర్క్: శ్రావణ మాసం శని త్రయోదశి శనివారం పురస్కరించుకుని హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

భవిష్యత్‌కు బాటలు వేసుకోండి

మడకశిరరూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. శనివారం వైబీహళ్ళి ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో సౌకర్యాలు, విద్య ప్రగతిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఉందని చెప్పడంతో కొత్త బోరు వేయుటకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అధికారులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. అలాగే కదిరేపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

రొద్దం: మండలంలోని పాతర్లపల్లి గ్రామం వద్ద పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై శనివారం బొలెరో వాహనం అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. కర్ణాటక రాష్ట్రం దావణగేరికి చెందిన కొందరు తిరుమల వెళ్లి తిరిగి వెళ్తుండగా వాహనం అదుపుతప్పింది. అయితే త్రుటిలో ప్రమాదం తప్పడంతో అందులో ప్రయాణిస్తున్నవారందరూ ఊపిరిపీల్చుకున్నారు. అదుపు తప్పిన వాహనాన్ని గ్రామస్తుల బయటకు తెచ్చారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పరిగి: మండలంలోని పోలీసులు, రెవెన్యూ అధికారులు శనివారం నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దారు హసీనా సుల్తానా తెలిపారు. మండల సరిహద్దు ప్రాంతాలైన సింగిరెడ్డిపల్లి, కొల్లకుంట నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని, కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

తీరిన తాగునీటి సమస్య

అమరాపురం: హలుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలలో శనివారం ఎంపీపీ నిధులతో బోరు వేయించారు. పుష్కలంగా నీరు పడటంతో తాగునీటి సమస్య తీరింది. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, ఆ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

అగళి: మండల కేంద్రంలో ఎరువుల, పురుగుమందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుకాణదారులు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నప్పుడు రైతులకు కచ్చితంగా ఒరిజినల్ రశీదు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అనుమతించిన విత్తనాలు అమ్మాలని సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

అమరాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. రోజూ డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

గుంతలు పూడ్చాలని నిరసన

మడకశిర: పట్టణంలోని ప్రధాన రోడ్లకు పడిన గుంతలను పూడ్చాలని శనివారం ప్రజా సంఘాల ప్రతినిధులు వినూత్న నిరసన చేపట్టారు. పట్టణంలోని శివాలయం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు చేరింది. గుంతల్లో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. అంతేకాకుండా తాత్కాలికంగా గుంతలను పూడ్చారు. వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకున్నారు. సీపీఐ తాలూకా కార్యదర్శి పవిత్ర మాట్లాడుతూ.. రోడ్లు గుంతలమయమైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకురాలు కన్యకుమారి, ఎమ్మార్పీఎస్ నాయకుడు అంజి, ప్రగతిశీల ప్రజాస్వామ్యం విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమేష్ నాయక్, స్థానిక నాయకులు అశోక్, ఈశ్వర్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో ఓ వ్యక్తి వద్ద నుంచి 40 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కర్ణాటక మద్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా టీవీఎస్ ఎక్స్‌ఎల్‌లో కర్ణాటక మద్యం తరలిస్తుండగా ఓ వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. ద్విచక్ర వాహనం సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


హిందూపురంలో ర్యాలీ చేస్తున్న వైద్యులు


పెనుకొండలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది


పావగడలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైద్యులు

హిందూపురం టౌన్: కలకత్తాలో డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఐఎంఏ ఆధ్వర్యంలో పట్టణ వ్యాప్తంగా ఓపీ సేవలను ఒక్క రోజు బంద్ చేసి వైద్యులు, వైద్య సిబ్బంది పట్టణంలో ప్రభుత్వాస్పత్రి నుంచి ర్యాలీ ప్రారంభించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి దోషులను శిక్షించాలంటూ నినాదాలు చేస్తూ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నరసింహారెడ్డి, కార్యదర్శి డాక్టర్ సుప్రవీన్, వైద్యులు చంద్రకిరణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, వెంకటరమణ, ఈటీ రామ్మూర్తి, లోకేంద్రనాథ్, షానవాజ్ ఖాన్, జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్, నర్సింగ్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో నిరసన తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, చంద్రశేఖర్, జయచంద్ర, రాజు, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: కలకత్తాలో ట్రైనీ వైద్యురాలు హత్యాచార దోషుల్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద నుంచి బస్టాండ్ వరకూ వైద్యులు నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు రామకృష్ణ, తేజశ్విని, కోడూరు పీహెచ్‌సీ వైద్యుడు నికేష్, ఎంఎల్‌హెచ్‌పీ పుష్ప,ప్రసాద్ ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ: కలకత్తా వైద్యురాలి హత్య ఘటన దోషులను కఠినంగా శిక్షించాలని వైద్యులు శివప్రసాద్‌నాయక్, భాస్కరరెడ్డి, అయిషా, క్రాంతికుమార్ తదితరులు డిమాండ్ చేసారు. పట్టణంలోని సూపరింటెండెంట్ మోహన్‌నాయక్ ఆదేశాల మేరకు స్థానిక సర్వజనాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిరసన తెలియజేశారు. సిబ్బంది బాను, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: కోల్‌కత్తాలో వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, ఆస్పత్రి సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం మెడికల్ ఆఫీసర్లు నవీన, సురేష్‌కుమార్, జుబేర్ ఆధ్వర్యంలో జరిగిన ఘటనను నిరసిస్తూ ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దారు హసీనా సుల్తానా, ఎంపీడీఓ సరస్వతి, ఎస్‌ఐ సత్యనారాయణకు ఫిర్యాదులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్ల: గోరంట్లలో ప్రభుత్వ , ప్రైవేట్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ చేశారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ వినోద్, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు పణిశంకర్, రవీంద్రనాథ్, ప్రదీప్‌రెడ్డి, మధుసూదనరెడ్డి, తేజ, శృతి, సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిర/పావగడ: వైద్యురాలిని హత్య చేయడం దుర్మార్గమని వైద్యులు మండిపడ్డారు. మడకశిర, పావగడలో డాక్టర్లు, సిబ్బంది రెండు గంటల పాటు వైద్య సేవలను బంద్ చేశారు. అత్యవసర సేవలు మాత్రమే కొనసాగించారు. వైద్యులకు రక్షణ లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరిస్తా

అమరాపురం: మండలంలోని ఉదుగూరు గ్రామంలో ఆక్రమణలను పార్టీలకతీతంగా తొలగించడానికి సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరుతో మాట్లాడారు. తన తోట సర్వే చేయించి హద్దు వరకూ ప్రహరీ నిర్మించుకున్నానన్నారు. అయితే ఎమ్మెల్యే ఎం ఎస్.రాజు గ్రామానికి వచ్చి ఆ ప్రహరీని తొలగించాలని అధికారులను ఆదేశించడం సరికాదన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. తన తోట ఎదురుగా టీడీపీకి చెందిన కొందరు ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించుకున్నారని.. దాని జోలికి పోకుండా పట్టా భూమిలో వేసుకున్న కంచెను తీయించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాను హేమావతి రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు 6 అడుగుల భూమిని రోడ్డు కోసం వదలినట్లు గుర్తు చేశారు. భూమిని సర్వే చేయించి, చట్టపరంగా తాను ఆక్రమణ చేసి ఉంటే తొలగించడానికి సిద్ధమన్నారు.